
సాక్షి ఒడిశా

బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,35,812లు, బంగారం 1 గ్రాములు, వెండి 11.2 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



**చకచకా తుంబ పనులు**

- 8లో



**ఆటో బోల్తా.. 8మందికి గాయాలు**

- 8లో

## న్యూస్‌రీల్

### ఆస్పత్రిలో చేరిన కమలా పుజారి



కమలా పుజారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్లు

**జయపురం:** వ్యవసాయ రంగంలో పద్మశ్రీ పురస్కారం సాధించిన ఆదివాసీ మహిళ కమలా పుజారి అనారోగ్యం కారణంగా జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేరారు. ఈ నేపథ్యంలో ఆమెను జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి మంగళవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య స్థితిపై వైద్యులతో చర్చించారు. వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాన్ని నియమించామని, ప్రాథమిక చికిత్స అనంతరం ఆరోగ్యం కుదుట పడిందని ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఆర్ఎస్ మిశ్రా తెలిపారు. వైద్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తూ రోజూ రక్త పరీక్షలు జరుపుతున్నామని వెల్లడించారు. ఆమె రక్షణ కోసం ఇద్దరు పోలీసులను నియమించారు. సేవలపై ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు.

### నేడు కృష్ణచంద్ర గజపతి జయంతి



కృష్ణచంద్ర గజపతి జయంతికి కలెక్టర్ విడుదల చేసిన ఆహ్వాన పత్రిక

**పర్లాకిమిడి:** మహారాజా కృష్ణచంద్ర గజపతి నారాయణదేవ్(1913–1974) 131వ జయంతి ఉత్సవాన్ని పట్టణంలో బుధవారం(నేడు) ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం నిశ్చయించారు. ఉదయం 7గంటలకు బజారు కూడలి వద్ద ఉన్న మహారాజా విగ్రహానికి పూలమాల వేసి, అక్కడి నుంచి ర్యాలీగా ప్యాలస్‌వీధి మీదుగా 7.30 గంటలకు శ్మశానవాటిక వద్ద సంస్మరణ కార్యక్రమం జరుగనుంది. ఇందులో గజపతి వంశీయురాలు కల్యాణీదేవి గజపతి పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5.00లకు టౌనుహాలులో జరిగే సాధారణ సభలో ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, మోహానా ఎమ్మెల్యే దాశరథి గమాంగో, కలెక్టర్ లింగరాజ్ పండా, కోస్తా జిల్లా ప్రహరీ పూర్ణచంద్ర మహాపాత్రో, ఎస్డీసీ చైర్మన్ మరియం రైయితో, జిల్లాపరిషద్ అధ్యక్షులు గవర తిరుపతిరావు, పురపాలక అధ్యక్షురాలు నిర్మలాశెఠి, ఏ.డి.యం. బీరెంద్ర కుమార్ దాస్ తదితరులు పాల్గొంటారు.

### తహసీల్దార్ల పనితీరుపై సమీక్ష

- ఉత్తమ ఫలితాలు అందించిన వారికి ప్రోత్సాహక బహుమతులు



గునుపూర్ సిబ్బందికి బహుమతులు అందిస్తున్న కలెక్టర్ సింగ్

**రాయగడ:** జిల్లాలోని 11 సమితుల్లో ఉన్న తహసీల్దార్ల పనితీరుపై కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ సమీక్షించారు. ఈ మేరకు సద్భావన సమావేశంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో రాయగడ సబ్ కలెక్టర్ భీమసేన్ సాబోరో, ఏడీఎం సోమనాథ్ ప్రధాన్, గుణుపూర్ సబ్ కలెక్టర్ లలితకుమార్ కుహూరా పాల్గొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తహసీల్దార్ కార్యాలయాల నుంచి వసూళ్లు చేసే నిర్ధారిత ఆదాయ లక్ష్యాలు, అదే విధంగా పలు కేసుల పరిష్కారం, సేవలు వంటి అంశాలపై సమీక్షించిన కలెక్టర్.. అనంతరం వారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. జిల్లాలోని 11 సమితుల తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ అధికారులు, సూపర్‌వైజర్లతో ముందుగా సమీక్షించారు. ఆయా తహసీల్ పరిధిలో వసూలైన ఆదాయ వనరులు, కేసుల పరిష్కారం వంటి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో సర్టిఫికెట్ కేసులకు సంబంధించి పరిష్కరించినందుకు గాను గుడారి తహసీల్‌కు, భూవివాద కేసుల పరిష్కారంలో అగ్రస్థానంలో నిలిచిన గుణుపూర్ తహసీల్ కార్యాలయం తహసీల్దార్, సిబ్బందికి ఆమె ప్రోత్సాహక బహుమతులు అందించారు. అలాగే మునిగుడ తహసీల్ 2022–23లో నిర్ధారిత లక్ష్యాన్ని చేరుకుని రెవెన్యూ వసూళ్లు చేసినందుకు గాను బహుమతులను అందించారు. రాయగడలో దస్త్రావేజుల పరివేక్షణతో పాటు ఆర్ఎఆర్ సర్టిఫికెట్ల మంజూరు విషయంలో తగిన కృషి చేసిందుకు ఆమె సంబంధిత అధికారులకు సన్మానించారు. రామనగుడ, పద్మపూర్, గుడారి తహసీల్ పరిధుల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ సేవలను ఆమె నియాడారు.

# రాష్ట్రంలో అతీక్ సహాయకుడు!

- బర్‌గడ్‌లో అతీక్ సోదరుడు ఉన్నట్లు పోలీసులకు సమాచారం
- ముందు జాగ్రత్తగా గాలించినా ప్రయోజనం శూన్యం
- అప్రమత్తంగా ఉండాలి: డీజీపీ బన్సాల్





వీడియో ఫుటేజ్‌లో గుడ్డూ ముస్లిం



మీడియాతో మాట్లాడుతున్న డీజీపీ సునీల్ కుమార్ బన్సాల్



అతీక్ అహ్మద్ సహాయకుడు గుడ్డూ ముస్లిం

**భువనేశ్వర్:** ఉత్తరప్రదేశ్‌లో రాజకీయ నాయకుడుగా ఎదిగి, హత్యకు గురైన గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్‌కు సన్నిహితుడు, కరుడుగట్టిన నేరస్తుడు గుడ్డూ ముస్లిం 12రోజులుగా రాష్ట్రంలో తల దాచుకున్నట్లు ప్రసారమైన వార్త తీవ్ర కలకలం రేపుతోంది. ఉమేష్ పాల్ హత్య కేసులో నిందితుడైన గుడ్డూ ముస్లింను ఉత్తరప్రదేశ్ పోలీసుల గాలింపు కొనసాగుతోంది. అదృశ్యమైన నిందితుడి ఆచూకీ చివరి ప్రదేశం రాష్ట్రంలో బర్‌గడ్‌గా ఖరారైనట్లు వార్తలు ప్రసారం అవుతున్నాయి. హత్యకు గురైన డాన్ అతీక్ అహ్మద్ అనుచరుడు గుడ్డూ ముస్లిం ఇటీవల కాలంలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో తారస పడింది. తాజాగా బర్‌గడ్‌లో ఉన్నట్లు రాష్ట్రేతర పోలీసు వర్గాల సమాచారం. గుడ్డూ ముస్లిం ఈనెల 2 నుంచి 13వ వరకు ఒడిశాలో ఉన్నాడని పోలీసులను ఉటంకిస్తూ ఒక ప్రముఖ జాతీయ వార్తా సంస్థ సమాచారం. దాదాపు 12 రోజుల పాటు రాష్ట్రంలో తలదాచుకున్న అతడు తన దుస్తులతో కూడిన బ్యాగ్‌ని వదిలి పారిపోయాడని ఈ సమాచారంలో పేర్కొంది. ఈ నేపథ్యంలో గుడ్డూ ముస్లిం సహాయకుడు రాజా ఖాన్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. పోలీసులకు దొరికిపోకుండా ఉండేందుకు గడ్డం పెంచుకున్నాడని విచారణలో వెల్లడైనట్లు ఈ సమాచారం తెలిపింది.

**పూరీ కటకక..**

గుడ్డూ ముస్లిం మీరట్, అజ్మీర్, ఝాన్సీ, నాసిక్, పూణే, ప్రస్తుతం ఒడిశాలో బర్‌గడ్ వంటి ప్రాంతాలకు ప్రయాణించినట్లు బలమైన ఆధారాలు ఉన్నాయి. ప్రస్తుతం అతడు ఛత్తీస్‌గఢ్‌కు పారిపోయాడని పోలీసులు తెలిపారు. అంతకుముందు, అతని చివరి మజిలీ కర్ణాటకలో ఉన్నట్లు గుర్తించారు. ఉమేష్‌పాల్ హత్య కేసులో నిందితులుగా ఉన్న 10 మందిలో గుడ్డూ ముస్లిం ఒకడు. వీరిలో అతీక్ అహ్మద్‌తో మరో 5 మంది చంపబడ్డారు. గుడ్డూ ముస్లిం ఇప్పటి వరకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతూ ఆట పట్టిస్తున్నాడు. గ్యాంగ్‌స్టర్–రాజకీయ నాయకుడు అతీక్ అహ్మద్ జైలు నుంచి బెయిల్‌పై విడుదల చేసిన నుంచి గుడ్డూ ముస్లిం ఆయన అనుచరునిగా పని చేస్తున్నాడు. గుడ్డూ ముస్లిం పేరుగాంచిన బాంబ్ స్పెషలిస్ట్‌గా పోలీసుల రికార్డుల్లో చోటు చేసుకున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉమేష్‌పాల్‌ను పట్ట పగలు హత్య చేసిన వీడియోలో మోటారు సైకిల్‌పై వెనుక కూర్చుని అవలీలగా నాటు బాంబులు రువ్వుతున్నట్లు రికార్డు అయింది. ఈ వీడియో రికార్డింగు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్‌లో అతని పేరు నమోదు చేశారు.

**ఎస్‌టీఎఫ్ ఏర్పాటు..**

ఐదుగురు సభ్యులతో కూడిన ఉత్తరప్రదేశ్ ప్రత్యేక టాస్కుఫోర్సు(ఎస్‌టీఎఫ్) బృందం ఈ నెల 18వ తేదీన బర్‌గడ్ సందడు లిపారు.ఈ బృందం బర్‌గడ్‌లో 2 రోజులు డేరా వేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని నిలదీసింది. ఈ నేపథ్యంలో వారికి నిబంధనల ప్రకారం అన్ని విధాలా సహకారాన్ని అందించినట్లు బర్‌గడ్ ఎస్పీ వివరించారు. ఎవరినీ అరెస్టు చేయలేదని ఎస్పీ తెలిపారు. అతీక్ అహ్మద్, అతని సోదరుడు అష్రఫ్‌లను ఇటీవల కాల్చిచంపిన ఘటనపై డీజీపీ సునీల్ కుమార్ బన్సాల్ మీడియాకు స్పష్టం చేశారు. ఈ మేరకు ఉత్తర ప్రదేశ్ పోలీసులు రాష్ట్ర పోలీసులకు ఎటువంటి సమాచారం అందజేయలేదని వివరించారు. గుడ్డూ ముస్లిం బర్‌గడ్‌లో ఉన్నాడని ఓ జాతీయ మీడియా వెబ్‌సైట్ పేర్కొందన్నారు. గత వారం, రాజా ఖాన్ ధ్రువీకరించేందుకు ఉత్తర ప్రదేశ్ పోలీసు బృందం బర్‌గడ్ సందర్శించింది. రాష్ట్ర పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, ఉత్తర ప్రదేశ్ పోలీసుల బృందం పూరీని సందర్శించిన దాఖలాలు లేవు. బర్‌గడ్‌లో రాజా ఖాన్ విచారణ చేపట్టారు. కానీ అతన్ని ఉత్తర ప్రదేశ్ పోలీసులు అరెస్టు చేయలేదు.

# నకిలీ సర్టిఫికెట్ల గుట్టురట్టు



మాట్లాడుతున్న బరంపురం ఎస్పీ సరవన్ వివేక్



పోలీసుల అదుపులో ఉపాధ్యాయుడు, నిందితులు

- ఉపాధ్యాయుడితో సహా నలుగురు నిందితుల అరెస్ట్
- ఆంధ్రాలోని నాగార్జున విశ్వవిద్యాలయం పేరుతో పత్రాలు: ఎస్పీ

**బరంపురం:** గంజాం జిల్లాలో గత కొంతకాలంగా నకిలీ సర్టిఫికెట్లు చెలామణీ చేస్తున్న ముఠాను బరంపురం పోలీసు గుట్టురట్టు చేశారు. ఈ మేరకు ఓ ప్రైవేట్ కళాశాల ఉపాధ్యాయుడితో పాటు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను బరంపురం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ సరవణ్ వివేక్ వెల్లడించారు. గుసానినువాగాం పోలీసు స్టేషన్ పరిధికి చెందని మనోరంజన్ గౌడా ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా బరంపురం ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక పోలీసు బృందాన్ని నియమించారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన సిబ్బంది.. స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వ్యక్తితో పాటు మరో నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి వందలాది నకిలీ సర్టిఫికెట్లు, కలర్ ప్రింటర్లు, కంప్యూటర్, స్కానర్‌తో పాటు నకిలీ స్టాంప్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు జిల్లాలోని కళ్లికోట్‌లో ప్రైవేట్ కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు దొతరి బెహరా, అతని కుమారులు అమృత ప్రసాద్ బెహరా, ప్రశాంత్‌కుమార్ బెహరా, కటక్‌కు చెందిన కిశోర్ బెహరాగా గుర్తించారు. స్వాధీనం చేసుకున్న నకిలీ విద్యార్హత ధ్రువపత్రాలు ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరుకు చెందిన నాగార్జున విశ్వ విద్యాలయం పేరుతో ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితులను మంగళవారం ఉదయం కోర్టులో హాజరు పరిచారు.

# దుర్గాపండాకు అభినందనలు



దుర్గా పండాను అభినందిస్తున్న ఎంపీ సప్తగిరి, నాయకులు

**రాయగడ:** ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సాధారణ కార్యదర్శిగా దుర్గా పండాను పీసీసీ నియమించడంపై ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు స్థానిక ప్రజా పనులశాఖ బంగ్లాలో పండాను మంగళవారం ఘనంగా సన్మానించారు. కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక, డీసీసీ ఉపాధ్యక్షుడు శంకర్షన్ మంగరాజ్, జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అస్లామ్‌ఖాన్, పట్టణ కమిటీ అధ్యక్షుడు మజ్జి శంకరరావు, సీనియర్ నాయకుడు అప్పలస్వామి కద్రక తదితరులు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుంటోందన్నారు. దుర్గా పండా నేతృత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని, కాంగ్రెస్‌కు పూర్వవైభవం చేకూరాలని ఆకాంక్షించారు.

**మాజీ ఎంపీ నెక్కంటిపై చర్యలు తీసుకోండి..**

రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావుపై స్థానిక లారీ యజమానుల సంఘం సదర్ పోలీస్ స్టేషన్‌లో ఏప్రిల్ 15న లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఈ సందర్భంగా దుర్గా పండా ఆరోపించారు. ప్రజా పనులశాఖ ఐబీలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టుల పేరిట చందాలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నా.. జిల్లా ఎస్పీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. లారీ యజమానుల సంఘం ఏర్పాటు చేసి దాదాపు 30 ఏళ్లు గడిచాయని, అప్పటి నుంచి ఈ వ్యవహారం కొనసాగుతోందన్నారు. ఇప్పటికైనా సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. 15రోజుల్లోగా చర్యలు తీసుకోకపోతే బీజేడీ రాష్ట్ర కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# కటక్‌లో పాల ధరలు పెంపు

- మే 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి

**భువనేశ్వర్:** కటక్ ప్రాంతంలో పాల ఉత్పాదనల ధరలు పెరగనున్నాయి. మే 1నుంచి పెంచిన కొత్త ధరలకు ఈ ఉత్పాదనలు విక్రయిస్తారు. ఈ నేపథ్యంలో పన్నీర్, కాటేజ్ చీజ్, కోవా ఇతరేతర పాల ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. ఒడిశా స్టేట్ కో–ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్(ఓంఫెడ్) మే1 నుంచి పాల ధరలను లీటరుకు రూ.2 పెంచడంతో పాల ఉత్పత్తుల ధరలను కిలోకు రూ.20 నుంచి రూ.60 రూపాయల వరకు పెంచాలని నిర్ణయించినట్లు కటక్ జిల్లా డెయిరీ ప్రొడక్ట్ ట్రేడర్స్ అసోసియేషన్ మంగళవారం తెలిపింది. పన్నీర్ ధర కిలో రూ.225 నుంచి రూ.255కి పెంచుతున్నట్లు సంఘం ప్రకటనలో పేర్కొంది. కాటేజ్ చీజ్(ఛెన్న) కిలో ధర రూ.175 నుంచి రూ.195, కోవా కిలో రూ.260 నుంచి రూ.320కి పెంచినట్లు తెలిపారు. ఓంఫెడ్ పాలు ధర పెంచిన ప్రభావంతో ఇతర ఇన్‌పుట్‌ల ఖర్చులు గణనీయంగా పెరిగాయి. సాధారణంగా 5 లీటర్ల పాల నుంచి కిలో పన్నీర్ ఉత్పత్తి అవుతుంది. పశుగ్రాసం, మందులు, వంటగ్యాస్ ఇతరేతర అనుబంధ ఖర్చులు పెరిగాయి. ఈ కారణాల వల్ల పాల ఉత్పత్తుల ధరలను పెంచాల్సి వచ్చిందని కటక్ జిల్లా డెయిరీ ప్రొడక్ట్ ట్రేడర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ బెహరా వివరించారు. ఈ విషయమై జిల్లాలోని పాల వ్యాపారులందరికీ సమాచారం అందించాం. పాడి రైతుల అభ్యర్థన మేరకు ఒడిశా స్టేట్ కో–ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్(ఓంఫెడ్) ప్యాకెట్ పాల ధరను పెంచినట్లు ఇటీవల ప్రకటించింది. దీని ప్రభావంతో పాల ఉత్పాదనల ధరల పెరుగుదల అనివార్యమైంది.

### వేషధారణపై గందరగోళం



మహిళల వేషధారణలో నిందితులు

**జయపురం:** బొయిపరిగుడ గ్రామంలో ఇద్దరు పురుషులు మహిళల వేషధారణలలో ప్రతి ఇంటికీ వెళ్తూ డబ్బులు వసూలు చేయడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ మేరకు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం సినీ స్టైల్‌లో ఓ వ్యక్తి బైక్‌పై ఇద్దరు పురుషులు మహిళల వేషంలో బొయిపరిగుడ దుర్గామండప వీధిలో ప్రతి ఇంటికి వెళ్తూ డబ్బు అడుగున్నారు. కొంతమంది యువకులకు వారిపై అనుమానం కలిగి, నిర్బంధించి, బొయిపరిగుడ పోలీసులకు తెలియజేశారు. అయితే వారు ఎప్పటికీ రాకపోవడంతో స్వయంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళలారు. దీంతో నిందితుల నుంచి పోలీసులు పలు రకాల వస్తువులు కనుగొన్నారు.

### బిజయకుమార్ ఎన్నికపై హర్షం

**పర్లాకిమిడి:** పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం మంగళవారం ఏర్పాటైంది. ఇందులో పార్టీ కార్యదర్శి బసంత పండా, అభిమన్యు పండా పాల్గొని, ఒడిశా మాజీ ముఖ్య శాసన కార్యదర్శి బిజయ కుమార్ పట్నాయిక్ ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ ముఖ్య ప్రచార కమిటీ రాజకీయ వ్యాపార కమిటీ అధ్యక్షులుగా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తంచేశారు. గజపతి కాంగ్రెస్ కమిటీ సభ్యులు శ్రీరామ్ సాహు, బబులీ సాహు, సూర్యనారాయణ పాత్రో, రాజ పాత్రో తదితరులతో కలిసి అభినందనలు తెలియజేశారు.

# సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బలవన్మరణం



సునీల్‌కుమార్(ఫైల్)



మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలిస్తున్న దృశ్యం

**రాయగడ:** పట్టణంలోని ఇందిరానగర్ నాలుగో లైన్‌లో ఉంటున్న సీఆర్‌పీఎఫ్ నాలుగో బెటాలియన్ క్యాంప్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ కామండెంట్ సునీల్‌కుమార్ (57) బలవన్మరణానికి పాల్పడ్డారు. అతని వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌తో స్వయంగా కాల్చుకుని, ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. మంగళవారం ఉదయం 10 గంటలకు చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి రాయగడ ఎస్పీ వివేకానంద శర్మ వివరాలను వెల్లడించారు. ఈ మేరకు స్థానిక పోలీసు క్యాంప్ కార్యాలయాన్ని పరిశీలించారు. 6నెలల క్రితం ఝార్కండ్‌లో విధులు నిర్వహించిన సునీల్‌కుమార్.. రాయగడ సీఆర్‌పీఎఫ్ నాలుగొ బెటాలియన్ క్యాంప్ కార్యాలయంలో అసిస్టెంట్ కమాండెంట్‌గా విధుల్లో చేరారు. బిహార్ లోని సీతామణి ఆయన స్వగ్రామం. అయితే ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డారో అధికారులకు అంతుపట్టడం లేదు. మంగళవారం ఉదయం క్యాంప్ కార్యాలయం నుంచి తుపాకీ పేలిన శబ్దం రావడంతో తోటి అధికారులు, జవాన్లు పరుగును అక్కడికి చేరుకున్నారు. రక్తపు మడుగులో సునీల్ పడి ఉన్నట్లు గుర్తించారు. పక్కనే సర్వీస్ రివాల్వర్ కనిపించడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయగడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# కరోనా కలవరం!

- గత 24 గంటల్లో రాష్ట్రంలో 393 కోవిడ్ కేసులు నమోదు
- ఆస్పత్రుల్లో తప్పనిసరిగా మాస్క్ ధరించాలని ఆరోగ్యశాఖ ఉత్తర్వులు



**భువనేశ్వర్:** రాష్ట్రంలో పెరుగుతున్న కోవిడ్–19 పాజిటివ్ కేసుల దృష్ట్యా రాష్ట్రప్రభుత్వం అన్ని ఆస్పత్రులు, ఇతర ఆరోగ్య సేవాసంస్థలు, కేంద్రాల్లో సిబ్బంది ముఖాన మాస్క్ ధరించడం తప్పనిసరి చేసింది. కోవిడ్ సంక్రమణ కదలిక పట్ల నిఘా కోసం ఆరోగ్య సంస్థలలోని ఉద్యోగులు తప్పనిసరిగా మాస్క్‌లు ధరించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ నిరంజన్ మిశ్రా మంగళవారం తెలిపారు. ఆరోగ్య సేవా కేంద్రాలు, సంస్థల సిబ్బంది పని వేళల్లో మాస్కు ధరించడం అనివార్యంగా పేర్కొన్నారు. సమావేశాలు తదితర జనసందోహిత కార్యక్రమాలు, కార్యకలాపాల సందర్భాల్లో క్రమం తప్పకుండా ప్రతిఒక్కరూ మాస్కు ధరించాల్సి ఉంటుంది. ప్రధానంగా ఇరుకైన ప్రాంగణాల్లో జన సందోహిత కార్యక్రమాల్లో కరోనా సంక్రమణ అవకాశాలు అధికంగా ఉన్నందున మాస్కు ధారణతో నివారణ చర్యకు అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంక్రమణ వంటి అనారోగ్య పరిసరాల సందర్భన పురస్కరించుకుని ప్రజలు జాగ్రత్త వహించాలని తెలిపారు. గత 24 గంటల్లో రాష్ట్రంలో పలు చోట్ల పరీక్షించిన 5,421 శాంపిల్స్‌లో 393 తాజా పాజిటివ్ కేసులు బయట పడ్డాయి. సుందర్‌గడ్ జిల్లాలో అత్యధికంగా 125 కొత్త కేసులు నమోదయ్యాయి. సంబల్‌పూర్ ప్రాంతంలో 71, కటక్ జిల్లాలో 65 పాజిటివ్ కేసులు నమోదై, తదుపరి స్థానాల్లో నిలిచాయి. రాష్ట్రంలో ఇప్పుడు 3,086 క్రియాశీల కేసులు కొనసాగుతున్నాయి, 339మంది రోగులు ఆరోగ్యంతో కోలుకున్నారు. పరీక్ష పాజిటివ్ రేటు(టీపీఆర్) 7.2 శాతంగా నమోదైంది. రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటి వరకు 3 కోవిడ్ మరణాలను అధికారికంగా ప్రకటించారు. దాదాపు 1.3శాతం మంది రోగులు ఆస్పత్రి పాలయ్యారు.

**వివిధ జిల్లాల్లో గత 24 గంటల్లో నమోదైన కోవిడ్ కేసులు**

| జిల్లా | పాజిటివ్ కేసులు |
|---|---|
| సుందరగడ్ | 125 |
| సంబల్‌పూర్ | 71 |
| కటక్ | 65 |
| మయూర్‌భంజ్ | 28 |
| ఖుర్దా | 27 |
| బొలంగీర్ | 21 |
| నువాపడా | 9 |
| సోన్‌పూర్ | 9 |
| బౌధ్ | 6 |
| జగత్‌సింగ్‌పూర్ | 4 |
| బర్‌గడ్ | 3 |
| దేవ్‌గడ్ | 3 |
| గంజాం | 3 |
| కొరాపుట్ | 3 |
| నవరంగ్‌పూర్ | 3 |
| నయాగడ్ | 3 |
| అంగూల్ | 2 |
| కలహండి | 2 |
| ఢెంకనాల్ | 1 |
| జాజ్‌పూర్ | 1 |
| ఝార్సుగుడ | 1 |
| కంధమాల్ | 1 |
| కేంద్రపడా | 1 |
| పూరీ | 1 |

# తాళం గల్లంతుపై హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం

- సీఎస్, న్యాయశాఖకు నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం
- రఘువీర్ దాస్ కమిషన్ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్





**భువనేశ్వర్:** పూరీ జగన్నాథుని ఆభరణాల ఖజానా తాళం చెవి గల్లంతు ఘటన మరోసారి తెరపైకి వచ్చింది. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిగింది. దీనికి సంబంధించి నివేదికను ఇప్పటి వరకు బహిర్గతం చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో రత్న భాండాగారం తాళం చెవి గల్లంతు న్యాయ విచారణ నివేదికను బహిరంగ పరచాలని హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ఈ కేసు విచారణ పురస్కరించుకుని ఇరుపక్షాలైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. జూలై 10లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఇరువురు ప్రతివాదులకు ఆదేశించింది. జగన్నాథుని నగలు, ఆభరణాలు, విలువైన పాత్రలు వగైరా భద్రపరిచే రత్న భాండాగారం తాళాలు గల్లంతు ఘటనపై విచారణకు ప్రభుత్వం జస్టిస్ రఘువీర్ దాస్ కమిషన్‌ను నియమించింది. విచారణ ముగిసినా, నివేదికను బహిరంగ పరచలేదు. 2018 నవంబర్ 30న కమిషన్ రాష్ట్ర హోంశాఖకు 324 పేజీల నివేదికను ప్రదానం చేసింది.

**ఇప్పటి వరకు రూ.22,27,918లు ఖర్చు..**

శ్రీ మందిరం రత్న భాండాగారం తాళం చెవి గల్లంతు ఘటనపై న్యాయ విచారణ కోసం రాష్ట్ర ఖజానా నుంచి సమగ్రంగా రూ.22,27,918 వెచ్చించారు. అత్యంత వ్యయ ప్రయాసలతో విచారణ పూర్తి చేసి, ప్రభుత్వానికి నివేదికను దాఖలు చేసి నాలుగేళ్లు గడుస్తున్నా.. బహిరంగ పరచకపోవడంపై విమర్శలు వ్యక్త మవుతున్నాయి. న్యాయ కమిషన్ దాఖలు చేసిన విచారణ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టడం ప్రభుత్వం చట్టపరమైన బాధ్యతగా గుర్తు చేస్తున్నారు. ఈ దిశలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు శూన్యంగా మారడంతో వివాదం న్యాయస్థానానికి చేరింది. నివేదిక బహిరంగ పరచడంలో ప్రభుత్వ జాప్యంతో రత్న భాండాగారం మరమ్మతులు చేయలేని పరిస్థితులు తాండవిస్తున్నాయి. నిధిలో ఎన్ని రత్నాలు, ఇతర అమూల్య సామగ్రి ఉందో లెక్క తేల్చి జాబితా సిద్ధం చేయడం సాధ్యం కాని పరిస్థితుల మధ్య సంకట పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితులను అధిగమించి రత్న భాండాగారం బాగోగుల పర్యవేక్షణ, అమూల్యమైన రత్నసంపద లెక్కా, జమ కార్యకలాపాలకు మార్గం సుగమం చేయాలని ప్రజాహిత వ్యాజ్యంలో పిటిషనర్ హైకోర్టును అభ్యర్థించాడు. అవాంఛిత జాప్యం నివారించి జస్టిస్ రఘువీర్ దాస్ కమిషన్ న్యాయ విచారణ నివేదికను బహిరంగ పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని సామాజిక కార్యకర్త దిలీప్ బొరాల్ హైకోర్టును కోరారు.

## క్లుప్తంగా

### ఆదిత్యుని సన్నిధిలో ఆప్కో చైర్మన్



చిరంజీవికి జ్ఞాపిక అందజేస్తున్న రంజిత్ శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బి.ఎ స్.చక్రవర్తి, ఆప్కో సిబ్బంది పాల్గొన్నారు.

### జస్టిస్ యతిరాజులుకు ప్రతిష్టాత్మక అవార్డు



జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు

శ్రీకాకుళం కల్చరల్: ఏపీ హైకోర్టు మాజీ జడ్జి, నారాయణ తిరుమల అనువంశిక ధర్మకర్త పి.ఎన్.కాలనీకి చెందిన జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు డాక్టర్ నీలం సంజీవ రెడ్డి న్యాయ శిరోమణి అవార్డు–2023కు ఎంపికయ్యారు. ఈ మేరకు డాక్టర్ నీలం సంజీవరెడ్డి మెమోరియల్ లెక్చర్, భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమీ(అగ్రశ్రీ) సంస్థ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. మే 19న తిరుపతిలో ఈ అవార్డు అందచేయనున్నట్లు పేర్కొంది.

### ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీజేఏసీ అమరావతి మలి దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా మంగళవారం ఉద్యోగులు నల్ల రిబ్బనులతో నిరసన వ్యక్తం చేశారు. నగరంలోని అంబేడ్కర్ జంక్షన్ సమీపంలోని రెవెన్యూ గెస్ట్ హౌస్ వద్ద కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ధర్నా చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.

### వ్యవసాయ పరిశోధనలు పెరగాలి



మాట్లాడుతున్న వ్యవసాయ విస్తరణ సంచాలకుడు సుబ్బిరామిరెడ్డి

శ్రీకాకుళం రూరల్: ఉత్తర కోస్తా జిల్లాల సంబంధించిన వ్యవసాయ ఉత్పత్తులపై పరిశోధనలు పెరగాలని ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం(గుంటూరు) పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి అన్నారు. జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఉత్తర కోస్తా మండల వ్యవసాయ విస్తరణ సమావేశాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న తొలకరిలో అధునాతన రకాలు ఎంటీయూ–1239, ఎంటీయూ–1318లతో పాటు నేరుగా విత్తే వరి విధానంలో యంత్రాల లభ్యత, ఫెర్టికం సీడ్రిల్‌లు నాలుగు జిల్లాలో పెరగాలన్నారు. పుష్పజాతి పంటల్లో కొత్త రకాలు తీసుకురావాలన్నారు. విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎ.సుబ్బిరామిరెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్నలో డీఏపీ, యూరియా కలిపిన ద్రావణాన్ని మొదల్లో పోయాలన్నారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ బి.వి.కె.జగన్నాథరావు మాట్లాడుతూ ఉత్పత్తి, దిగుబడులకు రైతులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### క్షయరోగులకు పౌష్టికాహార కిట్లు



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జాతీయ క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి టీబీ ముక్తా భారత్ అభియాన్ కింద ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం 40 మందికి పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బరాటం ముత్యాలమ్మ, ఇతర దాతల సహకారంతో ఈ కిట్లు సమకూర్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, కోఆర్డినేటర్ కె.సత్యనారాయణ, పి.చైతన్య, బి.చిన్మయరావు, బరాటం ముత్యాలమ్మ, ప్రకాష్, నరసింహమూర్తి కె.శ్యాంసుందర్, పవన్, మహేష్, ప్రసాదరావు పాల్గొన్నారు.

# చకచకా తుంబ పనులు



ఇరుసు తయారీకి కలపదుంగ కోత



తుంబ తయారీకి కొలమానం

- జోరుగా కొనసాగుతున్న పూరీ రథ నిర్మాణాలు

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని యాత్రకు రథాల తయారీ పనులు ఊపందుకున్నాయి. అక్షయ తృతీయ నుంచి ఈ పనులకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. మూడో రోజు మంగళవారం నాటికి ఇరుసు ప్రాథమిక స్థాయి తుంబ పనులు తొలిదశ పూర్తయ్యింది. శ్రీమందిరం సింహద్వారం ఆవరణ బొడొదండొ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద ఈ పనులు నిరవధికంగా కొనసాగుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచి వడ్రంగి సేవకులు పనుల్లో నిమగ్నం అవుతున్నారు. మంగళవారం సమగ్రంగా 40 మంది వడ్రంగి సేవకులు పాల్గొన్నారు. వీరిలో 17మంది మహరణ వర్గం, 12మంది భొయి వర్గం, 4 మంది కొరాతి (రంపపు కోత) వర్గం, ఆరు కమ్మరి కార్మికులు ఉన్నారు. సాయంత్రం చీకటి పడేంత వరకు శ్రమించి 3 రథాల కోసం మొత్తం మీద 9 తుంబల తయారు చేశారు. రథ చక్రం ఇరుసు యొక్క వృత్తాకార మధ్య భాగం తుంబగా వ్యవహరిస్తారు. 3 రథాల ప్రత్యేక విశ్వకర్మ ప్రముఖ వడ్రంగి సేవకుల పర్యవేక్షణలో వడ్రంగి పనులు చురుకుగా సాగుతున్నాయి. యాత్ర కోసం తయారు అవుతున్న తాళ ధ్వజం, దేవ దళనం, నంది ఘోష్ 3 రథాల కోసం సమగ్రంగా 42 తుంబలను తయారు చేస్తారు. వీటిలో బలభద్ర స్వామి రథం తాళ ధ్వజానికి 14, దేవీ సుభద్ర రథం దేవ దళానికి 12 మరియు శ్రీ జగన్నాథుని నంది ఘోష్ రథానికి అత్యధికంగా 16 తుంబల్ని అమర్చుతారు. బలభద్రుడు, శ్రీ జగన్నాథుని రథాల తుంబల కొలమానం 2 అడుగుల 8 అంగుళాలు కాగా దేవీ సుభద్ర రథం తుంబ పరిమాణం 3 అడుగులు ఉంటుంది.



తుంబ తయారీ



గోళాకార తుంబ కోసం చెక్కుడు

## కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన వారికి మరో అవకాశం

శ్రీకాకుళం న్యూకాలనీ: 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ప్రభుత్వం బంపర్ ఆఫర్ ఇచ్చింది. 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అయి, డీఈఓ వెబ్‌పోర్టల్ జాబితాలో పేరు ఉండి, ఈనెల 12వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించిన కౌన్సెలింగ్, నియామక ప్రక్రియకు హాజరుకాలేకపోయిన అభ్యర్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. వారికి ఈనెల 27వ తేదీన కౌన్సెలింగ్‌తోపాటు నియామక ప్రక్రియను కూడా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇలా కౌన్సెలింగ్‌కు రాని వారు జిల్లాలో 19 మంది ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ప్రభుత్వం కల్పించిన సువర్ణ అవకాశాన్ని (గైర్హాజరైన) అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. అభ్యర్థులు వారి హాల్‌టిక్కెట్‌తోపాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, 2 పాస్ ఫొటోలతో హాజరుకావాల్సి ఉంటుందని డీఈఓ సూచించారు.

# చివరి చూపైనా దక్కలేదు



బొంతల సురేష్

నరసన్నపేట: భార్య కన్నవారింటికి వెళ్లింది. భర్త వద్ద ఫోన్ లేకపోవడంతో అతని సమాచారం భార్యకు తెలిసే వీలు లేదు. ఆమె పుట్టినింటి నుంచి తిరిగి వచ్చేసరికి భర్త కనిపించలేదు. ఏమైందా అని ఆరా తీస్తే రోడ్డు ప్రమాదంలో అతను చనిపోయిన దిగ్భ్రాంతికర విషయం తెలిసింది. కమ్యూనికేషన్ లేకపోవడం వల్ల భర్త ఆఖరి చూపు కూడా ఆమెకు దక్కలేదు. తలసముద్రం గ్రామంలో జరిగిన ఈ ఘటన స్థానికులను కంటతడి పెట్టించింది. మండలంలోని దేవాది వద్ద ఈ నెల 15వ తేదీ రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో తలసముద్రం గ్రామానికి చెందిన బొంతల సురేష్ (36) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. అయితే ప్రమాదం జరిగాక మృతుడి వివరాలు పోలీసులకు తెలియకపోవడంతో మూడు రోజులు వేచి చూసి వారే ఖననం చేశారు. ఈ ప్రమాదం జరగడానికి రెండు రోజుల ముందు సురేష్ భర్త శివమోహిని పుట్టినింటికి వెళ్లారు. సురేష్ వద్ద ఫోన్ లేకపోవడం, మృతుడి వివరాలు పోలీసులకు కూడా తెలియకపోవడంతో భర్త చనిపోయిన సంగతి ఆమెకు తెలియలేదు. కన్నవారింటిలో పనులు ముగించుకుని ఆమె సోమ వారం తలసముద్రం వచ్చారు. కానీ ఇంటిలో భర్త కనిపించలేదు. ఎక్కడకు వెళ్లి ఉంటాడా అని ఆరా తీ స్తే దేవాది వద్ద జరిగిన ప్రమాదం జరిగిన విషయం తెలిసింది. ఆ ఫొటోలు పరిశీలిస్తే అక్కడ చనిపోయినది ఆమె భర్త సురేష్ అనే విషయం అర్థమైంది. దీంతో వెంటనే ఆమె పోలీసులను ఆశ్రయించి వివరాలు అందించారు. దీనిపై ఎస్ఐ వై. సింహాచలం మాట్లాడుతూ ఆధారాలు సేకరించి మృతి చెందిన వ్యక్తిని నిర్ధారిస్తామని అన్నారు. అయితే మృతదేహాన్ని ఖననం చేయడంతో ఆమెకు చివరి చూపు కూడా దక్కలేదు.

## దొంగ దొరికాడు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో సోమవారం రాత్రి 7.30 గంటలకు న్యూకాలనీలో జరిగిన దొంగతనం కేసును కాశీబుగ్గ పోలీసులు ఛేదించారు. సత్తుగణ సింగ్ చాట్ బండి వ్యాపారి ఇంటిలో దొంగతనం చేసిన వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పోలీసులు పట్టుకున్నారు. అదుపులోకి తీసుకుని వివరాలు రాబట్టగా ఒడిశా రాష్ట్రం ఖరడపల్లి గ్రామానికి చెందిన బజానా యక్‌గా గుర్తించి కేసు నమోదు చేశారు. ముద్దాయి నుంచి సుమారు రూ.80 వేలు విలువ చేసే తులంనర బంగారు వస్తువులు, రూ.9580 నగదు స్వాధీనం చేసుకున్నారు.

## ‘పూర్వ ప్రాథమిక విద్య’లో ప్రవేశాలకు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పూర్వ విద్య బోధకులకు ఉపయోగపడే ‘యర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్’ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ చెప్పారు. వర్సిటీ పరిపాలన కార్యాలయంలో మంగళవారం వివరాలు వెల్లడించారు. కోర్సు ఆన్‌లైన్‌లో ఉంటుందని పేర్కొన్నారు. 10వ తరగతి అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవచ్చని, అంగన్‌వాడీ కార్యకర్తలకు సీట్ల కేటాయింపులో ప్రాధాన్యమిస్తామని తెలిపారు. మే15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఆర్ఏయూ.ఈడీయు.ఇన్ వెబ్‌సైటలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రూ.250 రిజిస్ట్రేషన్ ఫీజు డీడీని దరఖాస్తుకు జతచేయాలని సూచించారు.

## కిరణ్‌చంద్ జీవితం స్ఫూర్తిదాయకం



మానవహారంగా ఏర్పడి శ్రద్ధాంజలి ఘటించిన చిన్నారులు

కవిటి: తాను చనిపోతూ శరీరభాగాలను మరో ముగ్గురికి దానం చేసిన కిరణ్‌చంద్ జీవితం స్ఫూర్తిదాయకమని సోంపేట పట్టణంలోని కల్యాణీ పాఠశాల హెచ్‌ఎం బిందుమాధవి అన్నారు. కిరణ్‌చంద్‌కు సంతాప సూచికగా మంగళవారం మానవహారం చేపట్టి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబానికి సంతాపం తెలియజేస్తూ కవిటి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

## పూడిక మన్ను..
# దిగుబడికి దన్ను



పశువుల గెత్తాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న కూలీలు

- సేంద్రియ ఎరువులతో భూమి సారవంతం
- తక్కువ ఖర్చుతో అధిక లాభం
- ఆసక్తి చూపుతున్న రైతులు

ఇచ్ఛాపురం రూరల్ : పంటలు సమృద్ధి పండాలంటే భూమి సారవంతంగా ఉండాలి. అయితే కొన్నాళ్లుగా రసాయన ఎరువులను అధిక మోతాదులో వినియోగించడం వల్ల చాలాచోట్ల భూమి సారవంతాన్ని కోల్పోయింది. ఫలితంగా తెగుళ్ల సోకడంతో దిగుబడి రాక అన్నదాత అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలతో ఎక్కువగా సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపుతున్నారు. పొలాల్లో భూసారాన్ని పెంపొందించేందుకు పశువుల పేడ, పూడిక మట్టిని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం దూరాన్ని బట్టి ట్రాక్టర్ ఎరువు రూ.1800 నుంచి రూ.2,300 వరకు ధర పలుకుతోంది. ఖరీఫ్ సీజన్‌లో రెండున్నర ఎకరాల పంట పొలాల్లో ఎకరాకు 4–5 టన్నుల వరకు సేంద్రియ ఎరువులను రైతులు వినియోగిస్తున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఒకే రకమైన పంటలను వేస్తుంటారు. ప్రతి సారీ పంటల మార్పిడితో పాటు నల్ల మట్టిని వేయడం వల్ల భూమిలో సారం పెరిగి చీడపురుగుల బారినుంచి రైతులు పంటలను కాపాడుకోవచ్చు. పూడిక మట్టిని పంట పొలాల్లో వేయడం వల్ల భూమిలో బంకమట్టి శాతం పెరుగుతోంది. దీంతో నీటిని, పోషక పదార్థాలను నిలుపుకునే శక్తి అధికమవుతోంది.

**పర్యావరణం దెబ్బతినకుండా..**

పంటల దిగుబడులకు ఒండ్రుమట్టి సంజీవనిలా పనిచేస్తుంది. చెరువులు, కుంటల్లోని నల్లటి ఒండ్రు మట్టి పోషక విలువలు కలిగి ఉండడం వల్ల రైతులకు పెట్టుబడి వ్యయాన్ని తగ్గిస్తుంది. సేంద్రియ ఎరువుల ఉపయోగంతో పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుందని వ్యవసాయ, ఉద్యానవన అధికారులు చెబుతున్నారు. రైతులు ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువులు, కుంటల్లోని మట్టిని ఉచితంగా తరలించుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. కేవలం పంట పొలాల్లోకే కాకుండా కొబ్బరి తోటల్లో పూడిక తీత మట్టిని, సేంద్రియ ఎరువులను వాడటం వల్ల ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులు సాధించేందుకు దోహదపడుతుంది. వ్యవసాయ, కొబ్బరి తోటల్లో భూసారం పెంచుకునేందుకు నల్ల మట్టిని పంట పొలాల్లో వేయడం ద్వారా పంటల దిగుబడి అధికంగా పొందవచ్చు. దీంతో భూసారం కూడా పెరుగుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వీటి వాడకం వల్ల ముఖ్యంగా కొబ్బరి తోటల్లో నీటి శాతం నిల్వ, వానపాముల సంపద పెరిగే అవకాశాలు అధికంగా ఉండటంతో ఉద్దానం రైతులు కొబ్బరి తోటల్లో విరివిగా ఉపయోగిస్తున్నారు.

### లాభాలు పుష్కలం



చెరువు మట్టి, సేంద్రియ ఎరువులతో భూమిలో సారం పెరిగి చీడపురుగుల బారి నుంచి రైతులు పంటలను కాపాడుకోవచ్చు. వర్షాలకు ముందే మట్టిని వేసుకుని కలియదున్నితే భూముల్లో చెరువు మట్టి కలిసిపోతుంది. దీనితో పాటు పశువుల పేడ, వేప నూనె వేసుకోవడం వల్ల అవి భూముల్లో కుళ్లిపోయి నేలసారవంతంగా మారుతుంది. – పిరియా శ్రీదేవి, వ్యవసాయాధికారి, ఇచ్ఛాపురం మండలం

## ఆటో బోల్తా.. 8మందికి గాయాలు



ఘటనా స్థలంలో బోల్తా పడి ఉన్న ఆటో



చిత్రకొండ ఆస్పత్రిలో బాధితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా హంతాల్‌గుడ ఘాట్ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 8మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. హంతాల్‌గుడ నుంచి చిత్రకొండకు వస్తున్న ఆటో బోల్తా పడింది. వీరిలో ఇద్దరి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో జోడాంబ్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న బీఎస్ఎఫ్ జవాన్లు అంబులెన్స్‌లో క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్సకు మల్కన్‌గిరి జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. ఆటో బ్రేక్ ఫెయిల్ కావడమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## అండర్–23 పురుషుల క్రికెట్ జట్టు ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్–23 పురుషుల క్రికెట్ జట్టు ఖరారైంది. 17 మంది క్రీడాకారులతో కూడిన జిల్లా జట్టు జాబితానుజిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి ముస్తాక్ మహ్మద్ మంగళవారం వెల్లడించారు. ఈ నెల 26 నుంచి విజయనగరం వేదికగా జరిగే ఏసీఏ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. 45 మంది ప్రాబబుల్స్ జట్టుకు సెలక్షన్ మ్యాచ్‌లు నిర్వహించిన తర్వాత సెలక్టర్లు ఎంపిక చేసిన మేరకు తుది జాబితా ప్రకటించినట్లు ముస్తాక్ చెప్పారు.

జిల్లా జట్టు : టి.విజయ్, డీవీఎస్ శ్రీరాం, డి.కులశేఖర్, ఎం.పూర్ణచంద్ర, ఎస్.సుశాంత్, ఎం.సూర్యకిరణ్, మీర్ హైదర్, కె.గణేష్, ఎస్‌డీఎస్‌వీ ప్రసాద్, జి.లవన్, కార్తికేయ, ప్రద్యున్షసాయి, ఎం.సాయియశ్వంత్, ఎస్.దినేష్‌చంద్ర, ఎం.మనోజ్, పి.సతీష్, ఎం.రోహిత్. స్టాండ్‌బైగా ఎన్ని జ్ఞానతేజ, జి.కళ్యాణ్, సిద్ధూ విజ్ఞాష్, ఎ.అప్పన్న, సయీర్.

## ప్రజల నాడికి దర్పణం పీపుల్స్ మెగా సర్వే



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురంరూరల్: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేలో కోటి కుటుంబాలలో రికార్డు స్థాయిలో 79 లక్షల ఫోన్‌కాల్స్ రిజిస్టర్ కావడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల ప్రజల స్పందనను తెలియజేస్తుందని శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కొఠారిలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటి వరకు 90256 కుటుంబాల్ని కలిసి 95 శాతం సర్వే పూర్తిచేశామన్నారు. నవరత్నాల పథకాలను శతశాతం అమలుచేసిన సీఎం జగన్ పాలనలో కొత్త ఒరవడి సృష్టించారన్నారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, కారంగి మోహనరావు, ఉప్పాడ రాజారెడ్డి, సర్పంచ్ దుక్క ధనలక్ష్మి, పిట్ట విశ్వనాథం, దక్కత నూకయ్య, రాంపత్ని చిట్టిబాబు, పిట్ట మామయ్య, నీలాపు జగదీష్, సారథి, తులసిరాం, చక్రవర్తి, బతకల మోహనరావు, యాదవరెడ్డి, నర్తు వరప్రసాద్, ఇసురు యాదవరెడ్డి పాల్గొన్నారు.

## పరిశుభ్రతతోనే మలేరియా నివారణ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ మీనాక్షి

అరసవల్లి: దోమకాటుతోనే మలేరియా వస్తుందని, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మలేరియా వ్యాధి కారక దోమల వ్యాప్తిని నివారించవచ్చునని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి సూచించారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు విద్యార్థులు చేపట్టిన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వణుకుతో కూడిన చలిజ్వరం లక్షణాలుంటే కచ్చితంగా మలేరియా పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ, అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనూరాధ, జె.కృష్ణమోహన్, మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, డెమో వెంకటరమణ, సామాజిక కార్యకర్త మంత్రి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## 100 బస్తాల గుట్కా పట్టివేత



గుట్కా బస్తాలను పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

టెక్కలి రూరల్: స్థానిక రోటరీనగర్–1లో ఏఎం టూ పీఎం రెస్టారెంట్ వెనుక భాగంలో హోటల్ సిబ్బంది ఉండే గదిలో సుమారు 100 బస్తాల గుట్కా, ఖైనీ, డీలక్స్, పాన్‌మసాలా బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. గోపాలకృష్ణ సిబ్బంది ఉండే గదిలో ఎటువంటి బిల్లులు లేకుండా గుట్కాను నిల్వ ఉంచాడనే సమాచారం మేరకు సోదాలు నిర్వహించినట్లు చెప్పారు. వీటి విలువ రూ.2లక్షల70వేలు ఉంటుందని అంచనా వేశారు. పూర్తిస్థాయిలో బిల్లులు లేనందుల కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఆ గుట్కా వ్యాపారి మాత్రం తన వద్ద బిల్లులు ఉన్నాయని, పూర్తిస్థాయిలో ఖైనీలు, డీలక్స్‌లు అమ్ముకునే అర్హత తనకు ఉందని, త్వరలోనే షాపు ఓపెన్ చేస్తానని చెప్పడం గమనార్హం.

## గంగానది పుష్కరాలకు
# ఆర్టీసీ ప్రత్యేక బస్సు



గంగానది పుష్కరాలు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీకాకుళం ఆర్టీసీ ఒకటి, రెండు డిపోల మేనేజర్‌లు మాధవ్, శర్మ, సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: గంగా నది పుష్కరాలకు వెళ్లే భక్తుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు నడుపుతున్నామని, వీటిని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీపీటీఓ ఎ.విజయ్‌కుమార్, ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్‌లు కె.మాధవ్, కేఎస్ఆర్ శర్మలు కోరారు. ఈ మేరకు గంగానది పుష్కరాలకు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ 2వ డిపో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ పుష్కరాలు ఏప్రిల్ 22న ప్రారంభమై మే 3తో ముగుస్తాయని అన్నారు. ఇప్పటికే ఈనెల 23న శ్రీకాకుళం నుంచి వారణాశికి ఒక బస్సు వెళ్లిందని, అలాగే ఈనెల 27వ తేదీన శ్రీకాకుళం రెండో డిపో నుంచి మరో బస్సు వారణాసి వెళ్లనుందని తెలిపారు. అదేవిధంగా ఈనెల 30వ తేదీన మరో సూపర్‌లగ్జరీ బస్సు శ్రీకాకుళం జిల్లా కేంద్రం నుంచి బయలుదేరి వెళ్లనుందని తెలిపారు. ప్రయాణ చార్జి సూపర్‌లగ్జరీ బస్సుకు టిక్కెట్ చార్జీ రూ.4,800, అల్ట్రా డీలక్స్ బస్సుకు టిక్కెట్ చార్జ్ రూ.4,700గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక సర్వీసులకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ ఆర్టీసీఆన్‌లైన్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో ముందుగా సీట్లు రిజర్వేషన్ చేయించుకొనే సౌకర్యం ఉందన్నారు. అలాగే శ్రీకాకుళం బస్ స్టేషన్‌లో గల రిజర్వేషన్ కౌంటర్లో కూడా టిక్కెట్లు లభిస్తాయని చెప్పారు. వివరాలకు 70950 40608, 99592 25609 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటవ డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్ ఉన్నారు.

## క్లుప్తంగా

### 13న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా జడ్జి సాయికల్యాణ చక్రవర్తి


మాట్లాడుతున్న జిల్లా జడ్జి బి.సాయి కల్యాణ చక్రవర్తి

**విజయనగరం లీగల్:** జిల్లా వ్యాప్తంగా మే 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి పిలుపునిచ్చారు. స్థానిక న్యాయవాదుల సంఘ భవనంలో మంగళవారం ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదుల సహకారం అదాలత్‌లకు చాలా అవసరమన్నారు. వారి సహకారంతోనే భారీ సంఖ్యలో కేసులు పరిష్కరించబడుతున్నాయన్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రిమినల్, సివిల్ కేసులతో పాటు రాజీ కాదగ్గ ఇతర కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు అదాలత్‌లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రెండు ఇళ్లు దగ్ధం


మంటల్లో కాలిపోయిన ఇళ్లు

**గరుగుబిల్లి:** మండలంలోని చినగుడబలో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో రెండిళ్లు కాలిపోయాయి. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన బలగ వెంకటరమణ, గౌరీప్రసాద్ ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. కుటుంబ సభ్యులు ఉపాధి పనులకు వెళ్లిన సమయంలో ప్రమాదం జరగడంతో ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు, విలువైన పత్రాలు, ఇతర సామగ్రి కాలిపోయాయి. ఇంటి సమీపంలో ఉన్న బైక్ కూడా మంటల్లో బూడిదైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్టు స్థానికులు అంచనా వేశారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఉప తహసీల్దార్ పి.లక్ష్మీకుమార్, వీఆర్‌ఓ జోజి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

### 27న మీ వద్దకే పీఎఫ్

**విజయనగరం టౌన్:** పీఎఫ్ ఖాతాదారులకు పెన్షనర్లకు పీఎఫ్ సంస్థల యాజమానులకు సంబంధించిన సమస్యలపై ఈ నెల 27న మీ వద్దకే పీఎఫ్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ అబ్దుల్ ఖాదర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విజయనగరంలో హిమగిరి థియేటర్ పక్కన ఎస్బీ బంగ్లా సమీపంలో ఉన్న ఈపీఎఫ్ కార్యాలయంలోనూ, పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పీఎఫ్ సమస్యలున్న వారందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### వివాహిత ఆత్మహత్యా యత్నం


చికిత్స పొందుతున్న గౌరమ్మ

**పార్వతీపురం:** మనస్తాపానికి గురైన ఓ వివాహిత ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. జియ్యమ్మవలస మండలం చినకుదమ గ్రామానికి చెందిన కె.గౌరమ్మ తన కుమారుడు, కోడలు అనరాని మాటలు ఆడుతున్నారని మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఉన్న చీమల మందును తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

### పిడుగు పడి వ్యక్తి మృతి


మృతి చెందిన అప్పలనాయుడు

**బొబ్బిలి:** మండలంలోని దిబ్బగుడ్డివలసలో పిడుగు పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మరడ అప్పలనాయుడు(52)పొలం పనులు చేస్తుండగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. పొలానికి వెళ్లిన అప్పలనాయుడు చీకటి పడినా ఇంకా రాకపోవడంతో పొలానికి వెళ్లి చూడగా అక్కడే పడి ఉండటాన్ని గుర్తించి కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. అప్పలనాయుడికి భార్య సత్యవతి, కుమారుడు, కుమార్తె ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు. మృతదేహాన్ని బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు.

# తిరుపతి వేదికగా సీఎం కప్ క్రీడా పోటీలు

- 14 క్రీడాంశాలు... 325 మంది క్రీడాకారులు
- వచ్చే నెల 1 నుంచి జరిగే పోటీల్లో తలపడనున్న 14 జిల్లా జట్లు
- రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులకు రూ.8లక్షల నిధుల కేటాయింపు
- క్రీడాకారులను ప్రోత్సహించటమే లక్ష్యం: సెట్విజ్ సీఈఓ


సాధన చేస్తున్న క్రీడాకారులు

**విజయనగరం:** ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో క్రీడా పోటీల నిర్వహణకు సిద్ధమైంది. రాష్ట్ర స్థాయిలో సీఎం కప్ పేరిట నిర్వహించే పోటీలకు సంబంధించి షెడ్యూల్ ఖరారైంది. వచ్చే నెల 1 నుంచి 5వ తేదీ వరకు తిరుపతి వేదికగా క్రీడా సంబరం జరగనుంది. ఈ మేరకు ఇప్పటికే జిల్లా స్థాయిలో పూర్తయిన జట్ల ఎంపిక ప్రక్రియలో అర్హత సాధించిన క్రీడాకారులకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు సమాచారం అందజేయగా... ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లా జట్లు తిరుపతికి పయనం కానున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

**ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన రాష్ట్ర స్థాయి పోటీలు**

రాష్ట్ర స్థాయిలో జరిగే సీఎం కప్ క్రీడా పోటీలు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన నిర్వహించనున్నారు. ఈ లెక్కన 13 జిల్లాల నుంచి 14 క్రీడాంశాలకు సంబంధించిన క్రీడాకారులు పాల్గొననున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలకు సంబంధించి గతంలో జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, ఖో–ఖో, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 325 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరంతా వచ్చే నెలలో జరగబోయే సీఎం కప్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ప్రత్యేక డ్రెస్‌కోడ్ పాటించాలని శాప్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయగా.. విజయనగరం జిల్లా క్రీడాకారులకు రెండ్ అండ్ వైట్ కలర్ కాంబినేషన్‌ను కేటాయించారు. ఇదిలా ఉండగా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అవసరమయ్యే క్రీడాదుస్తులు, ప్రయాణ, ఇతర ఖర్చుల కోసం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లాకు రూ.8 లక్షలు కేటాయించింది. మొత్తం రూ.10 లక్షల నిధులు కేటాయించగా... అందులో రూ.2 లక్షలు జిల్లా స్థాయి పోటీలకు వినియోగించారు. మిగిలిన రూ.8 లక్షలు మొత్తాన్ని రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులకు ఖర్చు చేయనున్నారు.

**ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం**



ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించటమే లక్ష్యంగా రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించటం జరుగుతుంది. ఈ పోటీలకు ఇప్పటికే జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పంపిస్తాం. పోటీలకు వెళ్లే క్రీడాకారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ఇందుకోసం రూ.8 లక్షలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా క్రీడాకారులు పోటీల్లో విజేతలుగా నిలిచి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి.

– బి.రామ్‌గోపాల్, సీఈఓ, సెట్విజ్, విజయనగరం

# ‘విద్యార్థి’ సినిమా బృందం సందడి


సినిమా పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి

**విజయనగరం అర్బన్:** గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మధు మాదాసు దర్శకత్వంలో నిర్మిస్తున్న ‘విద్యార్థి’ సినిమా బృందం సీతం కళాశాలను మంగళవారం సందర్శించింది. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు మధు మాదాసు, చిత్ర కథానాయకుడు చేతన్ చీను ఇతర ముఖ్య పాత్రధారులు పాల్గొని సీతం కళాశాల విద్యార్థులను ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, కళాశాల సెక్రటరీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేస్తూ ఈ చిత్రం విద్యార్థులందరూ చూసి సందేశాన్ని పొందాలన్నారు. జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని అలాగే ఈ చిత్రం అఖండ విజయ సాధించాలని కోరుకుంటూ చిత్ర కథానాయకుడు చేతన్‌కు ఆశీర్వాదాలు, దర్శకునికి అభినందనలు తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ ఈ సినిమా సందేశాత్మకమైనదని విద్యార్థులు చూడాల్సిన సినిమా అని అన్నారు. చిత్ర దర్శకుడు, కథానాయకుడు స్పందిస్తూ ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి విద్యార్థుల కోసం తీసిన చలనచిత్రమని అన్నారు. అనంతరం విద్యార్థులతో కథానాయకుడు సెల్ఫీ తీసుకొని ఉత్సాహపరిచారు.

### గ్యాస్ లీకేజీతో అగ్నిప్రమాదం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**శృంగవరపుకోట :** మేజర్ పంచాయతీ శృంగవరపుకోట పరిధిలోని సీతంపేట గ్రామంలో మంగళవారం వంట కోసం వినియోగించే ఎల్‌పీజీ గ్యాస్ సిలెండర్ లీకేజీతో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. శానాపతి సన్నిబాబు ఇంటిలో వంట చేసే ప్రయత్నంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. మంటలు ఆర్పే ప్రయత్నంలో శానాపతి నాయుడు చేతులు కాలాయి. మంటలు ఒక్కసారిగా వ్యాపించటంతో ఇంటిలో టీవీ, విద్యుత్ మీటర్, దుస్తులు, నిత్యావసర సామగ్రి కాలిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్.కోట ఫైర్‌స్టేషన్ సిబ్బంది వెళ్లి మంటలు అదుపు చేశారు. సుమారు రూ.1.50లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని అగ్ని మాపక సిబ్బంది తెలిపారు.

### బైక్‌తో లారీని ఢీకొన్న వ్యక్తి దుర్మరణం


మృతుడు కాకినాడ ఈశ్వరరావు(ఫైల్)

**భోగాపురం:** మండలంలోని రాజాపులోవ కూడలి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి లారీని ఢీకొన్న వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా సీపీఎం కాంపౌండ్ అమర్‌నగర్‌కు చెందిన కాకినాడ ఈశ్వరరావు(52) కోడలు విజయనగరం ఘోషాస్పత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మనుమరాలిని చూసేందుకు ఈశ్వరరావు సోమవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం నుంచి విజయనగరం బయలుదేరాడు. ఈ క్రమంలో రాజాపులోవ కూడలి వద్దకు చేరుకునే సమయంలో ఎదురుగా వస్తున్న లారీని బైక్‌తో అదుపుతప్పి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుని కుమారుడు కాకినాడ శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు.

# బాల్య వివాహాలు చేస్తే కేసులు


సమావేశంలో మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

- బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమిషన్ చైర్మన్ అప్పారావు

**విజయనగరం:** రాష్ట్రంలో ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే పోలీస్ కేసులు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదేశించారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు బాల్య వివాహాల నిర్మూలనలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ ప్రసన్న ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశానికి కార్పొరేటర్‌లు, అధికారులు, మహిళా పోలీస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసలి అప్పారావు మాట్లాడుతూ వివాహ వయసు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా మహిళలు విద్యాపరంగా, ఆరోగ్య పరంగా అభివృద్ధి చెందడంతో పాటు కుటుంబానికి ఆసరాగా నిలుస్తారని చెప్పారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే బాల్య వివాహాలను అరికట్టడంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అవకాశం ఉంటుందన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం వలన ఆరోగ్యపరంగా ఎన్నో ఇబ్బందులు గురవుతారన్నారు. ఒకటో పట్టణ సీఐ బెండు వెంకటరావు, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, కార్పొరేటర్‌లు, సీడీపీఓ విజయ్‌కుమారి, డీసీపీఓ సత్యనారాయణ, సూపర్ వైజర్లు, మహిళ సంరక్షకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే సిగ్నల్ కేబుల్స్ చోరీ

- ముగ్గురు రైల్వే ఉద్యోగులు, స్క్రాప్‌షాప్ నిర్వాహకుడు అరెస్టు
- పరారీలో మరో రైల్వే ఉద్యోగి
- వివరాలు వెల్లడించిన రైల్వే ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్

**విజయనగరం క్రైమ్:** రైల్వే సిగ్నల్ కేబుల్స్‌ను గత కొంతకాలంగా చోరీ చేస్తున్న దొంగలను గుర్తించామని, వీరిలో నలుగురు రైల్వే ఉద్యోగులు కాగా, ఒకరు స్క్రాప్ దుకాణం నిర్వాహకుడు ఉన్నట్టు ఆర్‌పీఎఫ్ ఇన్స్పెక్టర్ అఖిలేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. చోరీ వివరాలను వెల్లడించారు. రైల్వే సిగ్నల్ కేబుల్స్ అలమండ రైల్వేస్టేషన్ పరిసరాల్లో కుప్పలు తెప్పలుగా ఉంటాయి. వీటిపైన నలుగురు రైల్వే ఉద్యోగుల కన్నుపడింది. స్థానికంగా ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఆ నలుగురు ఎప్పటికప్పుడు కారులో కేబుల్స్ ఎక్కించుకుని వాటిని కా ల్చి అందులో ఉన్న కేబుల్ రాగిని పెందుర్తి వద్దను న్న స్క్రాప్ షాపులో అమ్మేసేవారు. వచ్చిన డబ్బుల ను సమానంగా పంచుకునేవారు. గత కొంతకాలంగా కేబుల్స్ చోరీ జరుగుతుందన్న ఫిర్యాదు మేరకు విజయనగరం ఆర్‌పీఎఫ్ ఇన్స్పెక్టర్ అఖిలేష్‌కుమా ర్, సిబ్బంది కలిసి ప్రత్యేక నిఘా పెట్టారు. నిందితులలో నలుగురు ఉద్యోగులలో పి.లక్ష్మణరావు, ఎమ్.సాయికుమార్, బి.దీపక్, స్క్రాప్ షాప్ నిర్వాహకుడు ఆదిరెడ్డిలను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఉద్యోగి దుర్గాప్రసాద్ పరారీలో ఉన్నట్టు పేర్కొన్నారు. నిందితులకు 13 రోజుల పాటు కోర్టు రిమాండ్ విధించినట్టు ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రతతో మలేరియా నివారణ


పార్వతీపురంలో మలేరియా నివారణ అవగాహన ర్యాలీ

**పార్వతీపురంటౌన్:** ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించి మలేరియా నివారణకు సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.బి.జగన్నాథరావు పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా పార్వతీపురం పట్టణంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న దోమ తెరలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మే నెల 15వ తేదీ నుంచి దోమల నివారణ మందు పిచికారీ చేస్తామని, ప్రజలంతా వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు, సూపరింటెండెంట్ డా.డి.భాస్కరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు, డా.నవీన్‌కుమార్, డా.వినోద్‌కుమార్, సహాయ మలేరియా అధికారి డి.సూర్యనారాయణ, శానటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మురళి, జీవీఆర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ తొమ్మిదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- గుమ్మలక్ష్మీపురంలో సీపీఎం, సీపీఐల ప్రచార భేరి బహిరంగ సభ


ప్రచార భేరి సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**గుమ్మలక్ష్మీపురం:** దేశంలో ప్రధానమంత్రి మోదీ తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి శూన్యమని, ప్రభుత్వరంగ సంస్థలైన రైల్వే, రక్షణ, ఎల్‌ఐసీ, బ్యాంకులు, ఓడరేవులు, వ్యవసాయం కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తున్నారని, గో రక్షణ పేరుతో నిత్యం మైనార్టీలు, దళితులపై దాడులకు తెగబడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు కళ్యాణమండపంలో సీపీఐ, సీపీఎం నియోజకవర్గ స్థాయి ప్రచార భేరి బహిరంగ సభను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనుకకు తెచ్చి పేదల ఖాతాల్లో రూ.15లక్షల చొప్పున జమచేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. దేశ సంపదను ఆదాని, అంబానీ లాంటి దొంగల చేతిలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలందరూ మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ పీసా చట్టం ప్రకారం గిరిజన ప్రాంతంలో ఉండే ప్రతిసెంటు భూమి పంచాయతీ తీర్మానం లేకుండా అమ్మేందుకు, కొనేందుకు వీలులేదని, 1/70 చట్టం, జీఓ నంబర్ 3కి తూట్లుపొడుస్తూ అడవులను కూడా ఆదానికి ధారదత్తం చేయాలని మోదీ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. మోదీ ప్రభుత్వాన్ని సాగనంపే రోజు వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు కోలక అవినాష్, తోట జీవన్, పి.కామేశ్వరరావు, రెడ్డి వేణు, కె.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

# నన్ను ఆదుకోరూ...

- మంత్రి బొత్సకు వినతి


రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న గోవింద్ తల్లి లక్ష్మి, తమ్ముడు ఈశ్వరరావు

**చీపురుపల్లి:** ఎంతో భవిష్యత్తు ఉన్న తమ బిడ్డ నేవీ కమాండర్ చందక గోవింద్ శిక్షణలో మృతి చెందడంతో తమ కుటుంబానికి తీరని అన్యాయం జరిగిందని తమ కుటుంబాన్ని ఆదుకోవాలని పర్ల గ్రామానికి చెందిన చందక లక్ష్మి విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను మంగళవారం కోరారు. ఈ మేరకు చీపురుపల్లి వచ్చిన మంత్రి బొత్స సత్యనారాయణను ఆమె కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారాగ్లైడింగ్ శిక్షణలో ఇటీవల తన కుమారుడు గోవింద్ ప్రమాదవశాత్తు మృతి చెందినట్టు చెప్పారు. దీంతో తమకు తీరని లోటు కలిగిందన్నారు. గోవింద్ తమ్ముడు ఈశ్వరరావుకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని కోరారు. భూమిని ఇచ్చి ఆదుకోవాలని విన్నవించారు. దీనిపై మంత్రి బొత్స సానుకూలంగా స్పందించారు.

# సీతంలో ‘మేధో సంపత్తి దినోత్సవం’


చెక్కును అందుకుంటున్న సీతం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదరనాయుడు

**విజయనగరం అర్బన్:** గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ‘ఉమెన్ అండ్ ఐపీ : ఏసెలేరేటింగ్ ఇన్నోవేషన్ అండ్ క్రియేటివిటీ’ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఐపీఎఫ్‌సీ, టీఐఎస్‌సీ సీనియర్ రీజనల్ మేనేజర్ డాక్టర్ విజయ్‌కుమార్ సాహూ మాట్లాడుతూ భారతదేశానికి నూతన ఆవిష్కరణల ఆవశ్యకత ఉందన్నారు. ప్రతి విద్యార్థి తన పరిధిని దాటి ఆలోచించి ఆవిష్కరణలు చేయాలని మేధోసంపత్తి చదువుకు, పరిశ్రమలకు మధ్య వారధిగా పని చేస్తుందన్నారు. డీఎస్ఎన్‌ఎల్‌యూ డైరెక్టర్, అకడమిక్ ఎఫైర్ అండ్ రీసెర్చ్ ప్రొఫెసర్ దయానందమూర్తి మాట్లాడుతూ పెద్ద పరిశ్రమలన్నీ ఒకప్పటి స్టార్ట్ అప్స్ అని అన్నారు. స్త్రీలకు పేటెంట్స్ చేయటానికి ప్రభుత్వం రాయితీని వివరించారు. మేధో సంపత్తిలోని రకాలను వాటి భద్రత హక్కులను విశదీకరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ మేధో సంపత్తికి కావలసిన పర్యావరణ వ్యవస్థను కళాశాలలో ఆవిష్కరించామని దానిని విద్యార్థులు పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం సీతం కళాశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు పేటెంట్స్ పొందినందుకు యాజమాన్యం ఒక్కొక్కరికీ నగదు బహుమతి చెక్కును ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ముఖ్య అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. వినికిడి లోపం ఉన్న వారికి పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, డీస్ డాక్టర్ వై.నరేంద్రకుమార్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్.వరూధిని, ఉపాధ్యాయులు, ఐపీసీ సమన్వయ కర్తలు పాల్గొన్నారు.

# న్యాయమూర్తులకు ఆత్మీయ వీడ్కోలు


అదనపు జిల్లా న్యాయమూర్తి రాధారత్నంకు సత్కారం

**విజయనగరం లీగల్:** విజయనగరంలో నిష్ణాతులైన సీనియర్ న్యాయవాదులు ఉన్నారని, వారి నుంచి సివిల్ లాలో నేర్చుకునే అవకాశం లభించిందని అదనపు జిల్లా న్యాయమూర్తి రాధారత్నం అన్నారు. జిల్లా న్యాయవాద సంఘ భవనంలో బదిలీపై వెళ్తున్న అదనపు జిల్లా న్యాయమూర్తి రాధారత్నం, సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, ఎక్సైజ్ మెజిస్ట్రేట్ బి.విజయలక్ష్మిలకు న్యాయవాదులు మంగళవారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విశాఖకు బదిలీపై వెళ్లిన న్యాయమూర్తి రాధారత్నం మాట్లాడుతూ రెండేళ్ల పాటు ఇక్కడ పని చేశానని, ఇక్కడ న్యాయవాదులు, సహచర న్యాయమూర్తుల సహకారం మరువలేనిదన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ముగ్గురిని న్యాయవాదుల సంఘం మెమొంటోలు, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి బి.కల్యాణచక్రవర్తి, రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ వైస్ చైర్మన్ కె.వి.ఎస్.తమ్మన్నశెట్టి, న్యాయవాదుల సంఘ ప్రతినిధులు సీహెచ్ దామోదర రామ్మోహనరావు, ఎ.అంజనీకుమార్, వి.జి.సంతోష్, కె.చిన అప్పారావు నాయుడు, ప్రభుత్వ న్యాయవాది టి.వి.శ్రీనివాసరావు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెల్లాన రవి, చింతపల్లి అప్పారావు, నండూరి రమేష్ పాల్గొన్నారు.

# విద్యాశాఖలో సస్పెన్షన్లపై విచారణ


విచారణ జరుపుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

**పార్వతీపురం:** జిల్లా విద్యాశాఖలో జరిగిన సస్పెన్షన్లపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ మంగళవారం విచారణ జరిపారు. సస్పెండ్ అయిన అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో మాట్లాడారు. పాలకొండ ఉపవిద్యాశాఖ అధికారి ఆర్.విజయకుమారి, అసిస్టెంట్ జీసీడీఓ కె.రోజారమణి, వీరఘట్టం మండలం రేగులపాడు కేజీబీవీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ రోహిణి, వీరఘట్టం ఎంఈఓ పి.కృష్ణమూర్తి, శ్రీకాకుళం ప్రభుత్వ పాఠ్యపుస్తకాల డిపోమేనేజర్ ఎన్.సతీష్ విచారణకు హాజరయ్యారు. విచారణ ప్రక్రియ బుధవారం కూడా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. విచారణను త్వరితగతిన పూర్తిచేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని చెప్పారు.

**సకాలంలో బియ్యం సరఫరా**

మిల్లర్లు సకాలంలో ధాన్యం మరపట్టించి బియ్యం ఎఫ్‌సీఐ, సీఎస్‌సీకి సరఫరా చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సివిల్‌సప్లై అధికారులు, మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో బియ్యం రవాణాపై సమీక్షించారు. బియ్యం రవాణాకు కావాల్సిన వాహనాలు సమకూర్చాలని, లోడింగ్, అన్ లోడింగ్‌కు హమాలీలను నియమించాలని అధికారులను ఆదేశించారు. అంటిపేట, సింగన్నపాలెం, బలిజిపేట, బూర్జ వద్దగల గొడౌన్‌లకు రోజువారీ లక్ష్యం మేరకు బియ్యం సరఫరా జరగాలన్నారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్ మాట్లాడుతూ మిల్లర్లు 2.13 లక్షల మెట్రిక్ టన్నులకు 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన బియ్యం సరఫరా చేశారని తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి కేవీఎల్ఎన్ మూర్తి, ఎఫ్‌సీఐ రీజనల్ మేనేజర్ ప్రపుల్లకుమార్, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ ప్రశాంత్‌బెహ్రా, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

**రైతులకు యంత్ర సేవలు**

వైఎస్సార్ రైతుయంత్ర సేవా కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తేవాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ నెల 28 నాటికి యంత్రాల పర్చేజ్ ఆర్డర్ పెట్టాలని సూచించారు. కిసాన్‌డ్రోన్ పైలెట్‌లను గుర్తించాలని, చిరుధాన్యాల సాగుపై దృష్టిసారించాలని సూచించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 587 మెట్రిక్ టన్నుల సమీకృత పశుదాణా(టీఎంఆర్) కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా పశుసంవర్థక అధికారి డాక్టర్ ఎ.ఈశ్వరరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి కేవీఎల్ఎన్ రెడ్డి, మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య, ఎల్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.